రేవంత్.. కేసీఆర్ ఆనవాళ్లను చెరపలేవు!

- ఆయన నిర్మించిన అద్భుత కట్టడాలనే అందాలభామలకు చూపించావు కదా?
- ఇప్పటికైనా పిచ్చి ప్రేలాపనలు మానుకో: మాజీ మంత్రి వేముల

హైదరాబాద్ మే 19 (నమస్తే తెలంగాణ): 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డీ.. ఏనాడూ కేసీఆర్ ఆనవాళ్లను చెరపలేవు.. ఎవరి తరం కాదు.. ఆయన కట్టిన అద్భుతమైన కట్టడాలనే అందాలభామలకు చూపించడం.. వారు అబ్బురపడటమే ఇందుకు సజీవ సాక్ష్యం..' అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టంచేశారు. 'కేసీఆర్ అంటేనే తెలంగాణ, తెలంగాణ అంటేనే కేసీఆర్' అనే విషయం మరోసారి ప్రపంచానికి తెలిసిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి పిచ్చి ప్రేలాపనలు, దిగజారుడు మాటలు మానుకొని పాలనపై, హామీల అమలుపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. కేసీఆర్ పాలనలో సకల హంగులతో నిర్మించిన సచివాలయం, పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, యాదగిరిగుట్ట ఆలయాన్ని చూసి ప్రపంచ సుందరీమణులు ఆశ్చర్యపోయారని, సెల్ఫీలు తీసుకొని సంబురపడ్డారని సోమవారం ఒక ప్రకటనలో గుర్తుచేశారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తే చెరిగిపోయేవి కాదని రేవంత్‌రెడ్డికి జ్ఞానోదయం అయిందనుకుంటా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నిర్మించిన అమరవీరుల స్మారకజ్యోతి, 125 అడుగుల అంబేద్కర్ మహావిగ్రహం, ఐటీ హబ్‌లను కూడా మిస్ వరల్డ్ కాంటెస్టెంట్లకు చూపించి చెప్పిన తప్పుడు మాటలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని సూచించారు. కేసీఆర్ నిర్మించిన కట్టడాలతో పాటు రాచరిక పోకడల పేరిట తెలంగాణ చిహ్నం నుంచి తొలగించిన చార్మినార్, కాకతీయ కళావైభవాలే మిస్ వరల్డ్ పోటీదారులకు చూపించేందుకు దిక్కయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రం దివాలా తీసిందని, అప్పు పుట్టడంలేదని చెప్పున్న రేవంత్‌రెడ్డి.. అందాల పోటీల పేరిట రూ.వేల కోట్లు ఎందుకు దుబారా చేస్తున్నారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.లక్ష, తులం బంగారం ఇవ్వడం చేతగాని ఆయన ప్రపంచ సుందరీమణులకు ఒక్కొక్కరికి 30 తులాల బంగారం పెట్టడం ఎంతవరకు కరెక్ట్ అని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు రేవంత్ గుర్తులను శాశ్వతంగా చెరిపేసేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

కేసీఆర్ అద్భుత కట్టడాలే దిక్కయ్యాయి: ఎర్రోళ్ల శ్రీనివాస్

కేసీఆర్ ఆనవాళ్లను తుడిచేస్తానని బీరాలు పలికిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కట్టిన కట్టడాలే ప్రపంచ సుందరీమణులకు చూపించేందుకు దిక్కయ్యాయని ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. అందాలభామలను తీసుకొచ్చిన కంట్రోల్ కమాండ్ సెంటర్, సెక్రటేరియట్, టీ-హబ్ ఎవరి ఆనవాళ్లని ప్రశ్నించారు. ఇప్పుడు మీ గౌరవాన్ని, పరువును కాపాడింది కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

సిలిండర్లు లేవనే ప్రచారం సరికాదు

పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ) : గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద బాధితులను దవాఖానలకు తరలించిన అంబులెన్స్‌లలో ఆక్సిజన్ సిలిండర్లు లేవనే ప్రచారాన్ని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 8 అంబులెన్స్‌లను ఘటనా స్థలానికి పంపామని, బాధితులను ఉస్మానియా, కేర్, అపోలో, యశోద దవాఖానలకు తరలించామని తెలిపారు. తొలి పేషెంట్‌ను ఉదయం 6:25 గంటలకు ఉస్మానియా దవాఖానకు తరలించినట్టు స్పష్టంచేశారు. ఘటన విషయం తెలిసిన మరుక్షణమే అప్రమత్తమై వెంటనే వైద్యుల బృందాన్ని పంపించామని వివరించారు. ప్రతి అంబులెన్స్‌లోనూ ఆక్సిజన్ సౌకర్యం ఉన్నదని, ఆక్సిజన్ సిలిండర్లు లేవనే తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

అందాల పోటీలేనా? ఆర్తనాదాలు వినరా?

- అంబులెన్స్‌ల్లో ఆక్సిజన్ లేకుంటే ఏం ప్రయోజనం?
- సకాలంలో సాయమందితే ప్రాణనష్టం తగ్గి ఉండేది
- ఇకనైనా మేల్కొని మరో ప్రాణం పోకుండా చూడాలి
- బాధితుల ఆర్తనాదాలు వింటే గుండె చెరువవుతున్నది
- వారిపట్ల ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలి
- బాధిత కుటుంబాలకు రూ.25లక్షల పరిహారమివ్వాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- గౌతమ్‌నగర్‌లో బాధిత కుటుంబాలకు పరామర్శ

గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాదంలో మరణించిన ప్రహ్లాద్ మోదీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తలసాని తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ) : అగ్ని ప్రమాదంలో 17 మంది ఒకే కుటుంబానికి చెందిన వారు చనిపోవడం అత్యంత బాధాకరమని, మనసున్న ఎవరికైనా గుండె తరుక్కుపోతుందని, హైదరాబాద్ చరిత్రలోనే ఇది దురదృష్టకరమైన రోజు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఫైరింజన్లు, ఆంబులెన్స్‌లలో సరైన సౌకర్యాలు ఉండి ఉంటే ఈ ఘటనలో ప్రాణనష్టం తగ్గి ఉండేదని అభిప్రాయపడ్డారు. గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం విషయంలో బాధిత కుటుంబసభ్యులు ఎవరినీ నిందించడం లేదని, వారు కొన్ని విషయాలు చెప్పారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీల మీదనే ధ్యాసనా?.. బాధితుల ఆర్తనాదాలు పట్టవా? అని ప్రశ్నించారు.పాతబస్తీలోని గుల్జార్‌హౌస్ సమీపంలో అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి కేటీఆర్ సోమవారం పరిశీలించారు. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లి గౌతమ్‌నగర్‌కు చెందిన ఒకే కుటుంబం వారు అగ్నిప్రమాదంలో చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మొదట శ్రీకృష్ణ పెరల్స్ షాపు వద్ద ప్రమాదం జరిగిన తీరును, అక్కడి పరిస్థితులపై అధికారులను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మంటల్లో మసైన ఉపకరణాలను చూసి ఆయన అగ్నికీలల తీవ్రతపై విస్తుపోయారు. అనంతరం ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా అగర్వాల్ కుటుంబానికి చెందిన బాధితులు కేటీఆర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఇక్కడ కేటీఆర్ మాట్లాడుతూ అగర్వాల్ కుటుంబంలో 17 మంది చనిపోవడం విషాదకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ఫైర్ బ్రిగేడ్‌లో నీళ్లు సరిగ్గా లేవని, ఫైర్ సిబ్బందికి సరైన మాస్కులు కూడా లేకపోవడంతో వారు లోపలికి వెళ్లి బాధితులను కాపాడలేకపోయారని వాపోయారు. ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ప్రజల ప్రాణాలు మరోసారి ప్రమాదంలో పడే అవకాశమున్నదని, ఇప్పటికైనా మేల్కోవాలని సూచించారు.

> హోం, అగ్నిమాపక శాఖలు సీఎం వద్దే ఉన్నయి. ఘటనా స్థలం వద్దకు రేవంత్‌రెడ్డి వస్తే బాగుండేది. అధికారులు ఇంకా అప్రమత్తమయ్యేటోళ్లు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం ఏ మాత్రం సరిపోదు. రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలి. ప్రాణాలు పోయిన తర్వాత నష్టపరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరుగకుండా చూసుకోవాలి. –కేటీఆర్

జాగ్రతలపై సమీక్షలు పెట్టాలి

తాను రాజకీయం చేయడానికి ఇక్కడికి రాలేదని, ఎవరినీ విమర్శించడం లేదని, ఇలాంటి కడుపుకోత ఇంకెవరికీ రాకూడదని వచ్చానని కేటీఆర్ స్పష్టంచేశారు. ఎండకాలం వచ్చిందంటే మున్సిపల్ శాఖ మంత్రి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశం పెట్టుకోవాలని సూచించారు. సిబ్బందికి నిరంతరం శిక్షణ ఇవ్వాలని, తరచూ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని చెప్పారు. ఇవేవీ జరగకపోవడం, సరైన సదుపాయాలు లేకపోవడం వల్లే ఇంత ప్రాణనష్టం జరిగిందని, ఎనిమిది మంది చిన్నారులు తమ కండ్ల ముందే చనిపోయారని బాధిత కుటుంబసభ్యులు, స్థానికులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పాతబస్తీ అధిక జన సాంద్రత కలిగిన, ఇరుకైన ప్రాంతం కావడంతో ఏదైనా ప్రమాదం జరిగితే అంబులెన్స్‌లు, ఫైరింజన్లు రావడానికి వీలు కాదని, ప్రాణాలు పోయిన తర్వాత నష్ట పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం జరగకుండా చూసుకోవాలని సూచించారు.

సీఎం వస్తే బాగుండేది

హైదరాబాద్‌కీ నిషానీ చార్మినార్ వద్దకు అందాల పోటీల కంటెస్టెంట్లను తీసుకురావడంపై, పోటీలకు ఖర్చు పెట్టడంపై ఉన్న శ్రద్ధ, రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లోనూ ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే సహాయక చర్యలు అందేలా కల్పించాల్సిన సౌకర్యాలపై పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. హోం, అగ్నిమాపక శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయని, ఘటనా స్థలం దగ్గరకు రేవంత్‌రెడ్డి వస్తే బాగుండేదని, అధికారులు మరింత అప్రమత్తమయ్యేవారని చెప్పారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల నష్టపరిహారం సరిపోదని, వారి ఇంటికి, వ్యాపారానికి తీవ్రనష్టం జరిగిందని తెలిపారు. అగర్వాల్ కుటుంబం మళ్లీ వ్యాపారాన్ని ప్రారంభించుకొనేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. బాధిత కుటుంబాలకు రూ. రూ.25 లక్షల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తరపున కూడా ఆదుకునే ప్రయత్నం చేస్తామని, ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని సూచించారు.

రెండేండ్ల చిన్నారిని సమాధి చేసినం మేం బతికేం లాభం?

ఫైర్ బ్రిగేడ్‌లో నీళ్లులేవు.. సిబ్బందికి మాస్కుల్లేవు • సమయానికి సాయమంది ఉంటే ఇంకొందరు బతికేవాళ్లు

అందరినీ కోల్పోయినం.. చిన్నపిల్లలు చనిపోయిండ్రు • కేటీఆర్ ఎదుట బోరుమన్న అగ్నిప్రమాద బాధితులు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ) : 'రెండేండ్ల చిన్నారి ప్రమాదంలో చనిపోయింది. సమాధి చేసి వచ్చినం. మా జీవితంలో ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకేమైనా ఉన్నదా? మేం బతికుండి ఎందుకు? ఈ యాక్సిడెంట్‌లో పదిహేడుమందిని కోల్పోయినం. అందరూ మా కుటుంబసభ్యులే.. మా సొంత సోదరి సచ్చిపోయింది. చిన్నచిన్న పిల్లలు సచ్చిపోయిండ్రు. ఫైర్ యాక్సిడెంట్ జరిగిప్పుడు కాపాడేందుకు లోకల్ వాళ్లు అందరూ వచ్చిండ్రు. ఫైర్ ఇంజిన్లు వచ్చినయ్. కనీ వాటిలో నీళ్లు లేవు.. లోపలికి వెళ్లి కాపాడాలంటే మాస్కులు లేవని ఫైర్ సిబ్బంది చెప్పిండ్రు. ఇంత కంటే దారుణం ఉంటదా సార్!' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎదుట గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాద మృతుల బంధువు రాహుల్ అగర్వాల్ తన ఆవేదన చెప్పుకొచ్చాడు. సమయానికి సరైన సహాయం అంది ఉంటే ఇంకొంతమంది ప్రాణాలైనా దక్కేవని, చిన్నారులు చచ్చిపోయారంటూ బోరుమన్నాడు. ఫైర్ సిబ్బంది తమకు గ్లౌజులు లేవని, గాగూల్స్ లేవని చెప్పారని, అవేవీ లేకుండా లోపలికెలా వెళ్లాలని అడిగారని వాపోయాడు. ప్రమాదం జరిగిన తీరు, చనిపోయినవారి వివరాలను కేటీఆర్ తెలుసుకున్నారు. అక్కడే ఉన్న సమాజ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్‌రెడ్డితో పాటు పలువురు పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రమాదంలో మరణించిన వారి ఆత్మకు శాంతిచేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని కేటీఆర్ భరోసానిచ్చారు.

ఇందిరమ్మ ఇండ్లకు రూ.53.64 కోట్లు

- వివిధ దశల్లో ఉన్న 5,364 ఇండ్లకు నిధుల విడుదల
- 20,104 ఇండ్ల గ్రౌండింగ్ పూర్తి
- మంత్రి పొంగులేటి వెల్లడి

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అనుగుణంగా నిధులు విడుదల చేస్తున్నట్టు రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటి వరకు వివిధ దశల్లో ఉన్న 5,364 ఇండ్లకు రూ.53.64 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. ఇందులో బేస్‌మెంట్ పూర్తయిన 1,383, గోడలు పూర్తయిన 224 ఇండ్లకు రూ.16.07 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. సోమవారం జూమ్ మీటింగ్ ద్వారా లబ్ధిదారులకు చెల్లింపులపై అధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కింద 47,335 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు 20,104 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని, ఇందులో 5,140 ఇండ్లు బేస్‌మెంట్, 300 ఇండ్లు గోడల నిర్మాణం, మరో 10 ఇండ్లు స్లాబ్‌దశ వరకు పూర్తయినట్టు వివరించారు. వానకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా ఇండ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సర్వే రికార్డుల డిజిటలైజేషన్

రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లోని సర్వే రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించినట్టు మంత్రి పొంగులేటి వెల్లడించారు. తొలుత ప్రయోగాత్మకంగా నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం లింగాల, జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కలపల్లి, ఖమ్మం జిల్లా కల్లూరు మండలం పెద్దకోరుకొండి గ్రామాల్లో ఈ ప్రక్రియను రెండ్రోజుల్లో ప్రారంభించనున్నట్టు తెలిపారు. మ్యానువల్ పద్ధతి కంటే వేగంగా, తక్కువ ఖర్చుతో డిజిటల్ మ్యాపింగ్ ద్వారా భూక్షేత్రాల పరిమాణం, ఆకృతి తదితర వివరాలు కచ్చితంగా పొందవచ్చని చెప్పారు. ఐదు వేల మంది సర్వేయర్ల నియామకానికి 10,031 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. వీరికి రెండు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు.

రేవంత్ పాలనలో రాష్ట్రం అధోగతి

- ఆరు గ్యారెంటీల ఊసే మరిచిన సర్కార్
- రాష్ట్ర అభివృద్ధిని మరిచి కేసీఆర్‌ను తిట్టడమే పని
- కొండగట్టు ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలి
- మాజీ ఎంపీ వినోద్‌కుమార్
- కొడిమ్యాల మండలంలో బీఆర్ఎస్‌లో చేరికలు



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లిలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్న ఏడెల్లి పర్శరాములుకు గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మల్యాల/ కొడిమ్యాల, మే 19 : రేవంత్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లిలో కాంగ్రెస్, బీజేపీ నుంచి కొండాపూర్‌కు చెందిన కందుల రమణారెడ్డి, గోపాల్‌రావుపేటకు చెందిన ఏడెల్లి పర్శరాములుతోపాటు పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఆయన గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. అంతకు ముందు మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామిని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిని మరిచిన రేవంత్ కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా దాటవేసే ప్రయత్నం చేస్తున్నట్టు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై త్వరలో సదస్సు నిర్వహించి నిజానిజాలు ప్రజలకు వివరించనున్నట్టు తెలిపారు. గతంలో ఆంజనేయస్వామి ఆలయానికి 5.30 ఎకరాలుండగా, బీఆర్ఎస్ హయాంలో 333 ఎకరాల రెవెన్యూ భూమిని దేవాదాయ శాఖకు బదిలీచేసి విస్తరించినట్టు తెలిపారు. ప్రతి ఏటా రెండు హనుమాన్ జయంతులను నిర్వహించే ఏకైక ఆలయం కొండగట్టు అని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో కొండపైన నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సంతలోని లొద్దిని ప్రత్యేక రిజార్వాయర్‌గా మార్చి కొండపైకి తీసుకొచ్చేందుకు పనులను ప్రారంభించామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నిధులు కుదించడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే సత్యం కొండగట్టు ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ హయాంలో రూ.1000 కోట్లు ప్రకటించి, రూ.500 కోట్లకు ప్రణాళికలు రూపొందించామని గుర్తుచేశారు.

కేసీఆర్ విజనరీ.. రేవంత్ ప్రిజనరీ

- కేసీఆర్‌వి అభివృద్ధి ఆనవాళ్లు.. రేవంత్‌వి అవినీతి పరవళ్లు
- కేసీఆర్ పాలనావైభవం చూసి ప్రపంచ అందగత్తెల పరవశం
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి/ఆర్మూర్‌టౌన్, మే 19 : తెలంగాణ తొలిసీఎం కేసీఆర్ అంటే విజనరీ, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అంటే ప్రిజనరీ అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణ ధరిత్రి మురిసేలా చరిత్రకెక్కిన ఆనవాళ్లు అని అభివర్ణించారు. కేసీఆర్ ఆనవాళ్లు తెలంగాణ ప్రజల గుండె చప్పుళ్లు అని, తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు కేసీఆర్ అనే మూడక్షరాలు ప్రజల మనోఫలకంపై చెరగని శిలాక్షరాలని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డివి తెలంగాణ పరువు తీస్తున్న అవినీతి పరవళ్లు అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనచూసి ప్రపంచ అందగత్తెలు పరవశించారని, కేసీఆర్ అద్భుత కట్టడాలు ప్రపంచానికి తెలిసేలా చేసిన రేవంత్‌రెడ్డికి థ్యాంక్స్ అని చెప్పారు. సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్, టీ-హబ్‌ని ఎవరు కట్టారని విశ్వసుందరీమణులు అడగలేదా? అని ప్రశ్నించారు. యాదాద్రి దేవస్థానం కేసీఆర్ ఆధ్యాత్మిక ప్రస్థానానికి ప్రతీక అని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, దళిత బంధు కేసీఆర్ సాధించిన అద్భుతమైన విజయాలని గుర్తుచేశారు. 2013-14 వరకు కోటీ 55 లక్షల ఎకరాల్లో సాగు చేస్తే, కాళేశ్వరం తదితర ప్రాజెక్టులతో 2022-23 నాటికి 2 కోట్ల 29 లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెంచిన చరిత్ర కేసీఆర్‌ది అని పేర్కొన్నారు. ఆహార పంటల ఉత్పత్తికి సంబంధించి 2013-14లో 2.25 కోట్ల టన్నులు పండిస్తే, 2023-24 లో 5 కోట్ల టన్నుల ఉత్పత్తి సాధించడం కేసీఆర్ విజన్‌కు నిదర్శనమన్నారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, కరెంట్ నుంచి కంటి వెలుగు వరకు అభివృద్ధి జాడలన్నీ కేసీఆర్ ఆనవాళ్లే అని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి పాలనలో ఒక స్కీము, ఒక డ్యాం ప్రారంభించలేదు, కూల్చివేతలు, కాల్చివేతేలు, పేల్చివేతలు తప్ప చెప్పుకోవడానికి ఏమున్నాయని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి ధనదాహానికి బలైన మూసీ పేద బతుకులు, హెచ్‌సీయూ భూముల స్వాహాకు కుట్రలు, 420 హామీలు, ఆరు గ్యారెంటీల మోసాలను సందరీమణులకు వివరించాలని ఎద్దేవాచేశారు.

అక్రమ మైనింగ్ తక్షణమే ఆపండి

- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

జగిత్యాల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

జగిత్యాల/ మెట్‌పల్లి, మే 19: జగిత్యాల జిల్లాలో అక్రమ మైనింగ్‌ను తక్షణమే ఆపి, ప్రజా సంపదను కాపాడాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల కోరారు. సోమవారం ఆయన కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. మెట్‌పల్లి-కమ్మర్‌పల్లి జాతీయ రహదారిపై మేడిపల్లి శివారులో రాత్రింబవళ్లు మట్టిని అక్రమంగా తరలిస్తూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొందరు లూటీ చేస్తున్నారని తెలిపారు. తక్షణమే మైనింగ్ ఆపి, ప్రజల సంపదను కాపాడాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి ఇవ్వాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కోరారు.

పచ్చిరొట్ట విత్తనాల ధరల పెంపుపై నిరసన

పచ్చిరొట్ట విత్తనాల ధరల పెంపుపై రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వానకాలానికి సంబంధించి విత్తనాల ధరలను ప్రభుత్వం రెట్టింపు చేసింది. జీలుగు, జనుము, పిల్లిపెసర విత్తనాల పంపిణీ ప్రక్రియను సోమవారం నుంచి ప్రారంభించింది. కోరుట్ల నియోజకవర్గానికి సంబంధించి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కేంద్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించేందుకు స్థానిక వ్యవసాయశాఖ అధికారులు సంజయ్ కల్వకుంట్లను ఆహ్వానించగా, అందుకు ఆయన తిరస్కరించారు. విత్తనాల ధరలను ప్రభుత్వం రెట్టింపు చేయడాన్ని నిరసిస్తూ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. రైతులు, వ్యవసాయం పట్ల కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు.

'చేనేతల సమస్యలు పరిష్కరించండి'

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ) : చేనేత పరిశ్రమ సమస్యల పరిష్కారంపై బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాశ్ తయారుచేసిన ప్రతిపాదనలను సోమవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీసీ కమిషన్ పంపింది. ఈ రంగానికి తగ్గుతున్న బడ్జెట్ కేటాయింపులు, పెరుగుతున్న తయారీ ఖర్చులు, ప్రభుత్వ సంస్థలు, వ్యవస్థీకృత ఆర్థిక సంస్థల నుంచి రుణ సౌకర్యాలు తగ్గిపోవడం వంటి వివిధ అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ చేనేత కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన వివిధ చర్యలను ప్రతిపాదనల్లో వివరించారు. చేనేత కార్మికుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రిని బీసీ కమిషన్ చైర్మన్ జీ నిరంజన్ కోరారు.

అగ్నిప్రమాదంపై హెచ్‌ఆర్సీ విచారణ

30లోగా నివేదిక ఇవ్వాలని వివిధ శాఖలకు ఆదేశం

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలో గుల్జార్‌హౌస్ వద్ద శ్రీకృష్ణ పెరల్స్ భవనంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాద ఘటనను తెలంగాణ మానవహక్కుల కమిషన్ (టీజీహెచ్‌ఆర్సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది. ఈ దుర్ఘటనలో 17 మంది మృతిచెందారని, భవన భద్రత, విద్యుత్తు నిర్వహణ, అగ్నిప్రమాద నివారణకు సంబంధించిన నిబంధనలను పాటించకపోవడమే ఇందుకు కారణమని పేర్కొంటూ మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఈ నెల 30న విచారణ చేపట్టనున్నట్టు టీజీహెచ్‌ఆర్సీ ప్రకటించింది. ఈ లోగా ఆ అగ్నిప్రమాదంపై సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎస్‌తోపాటు హైదరాబాద్ పోలీస్ కమిషనర్, ఫైర్ డిపార్ట్‌మెంట్ డీజీ, ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజినీర్లను ఆదేశించింది.

మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయికి రూ.లక్ష చెక్కు అందజేస్తున్న పాఠశాల హెచ్ఎం, సిబ్బంది

జాతీయ రక్షణ నిధికి విరాళాలు

- జోగులాంబ గద్వాల జిల్లాలో కలెక్టర్‌కు రూ.లక్ష చెక్కు అందజేత
- రిటైర్డ్ హెచ్ఎం లక్ష్మీకాంత్‌రెడ్డిని అభినందించిన కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్ట